## క్లుప్తంగా

### మెనూ ప్రకారం భోజనం పెట్టాలి



చెన్నారావుపేట :విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఎంపీపీ బాదావత్ విజేందర్ అన్నారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థినిలకు పాఠాలు బోధించారు. ఆయన వెంట ఎస్ఓ జ్యోతి, ఉపాధ్యాయినీలు ఉన్నారు.

### ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకొండి

నల్లబెల్లి: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం అర్హులైన వారందరు ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని తహసీల్దార్ రాజేష్ సూచించారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక త్వరలోనే జరుగనుందన్నారు. 1 నవంబర్ 2020 వరకు డిగ్రీ పూర్తి చేసిన వారు ఓటు నమోదు చేసుకునేందుకు అర్హులని చెప్పారు.

### పంటలకు దేవాదుల నీరందించాలి



సంగెం : పంటలకు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు నీరందించి ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. బుధవారం తీగరాజుపల్లి గ్రామంలోని దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు కాల్వలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గవిచర్ల, రామచంద్రాపురం, లోహిత, ఆశాలపల్లి, కాట్రపల్లి, వెంకటాపూరం, గుంటూరుపల్లి, షాపూర్, తీగారాజుపల్లి గ్రామాల రైతులు తమ భూములను దేవాదుల కాల్వలకు ఇచ్చారని తెలిపారు. కాలవలు తవ్విన దగ్గర నుంచి ఇప్పటి వరకు తీగరాజుపల్లి గ్రామానికి చుక్క నీరు రాలేదని, కాల్వలు వృథాగా పిచ్చిమొక్కలతో నిండి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు నీటిని అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. లేకుంటే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు మల్లేష్, భాస్కర్, రాజు, ఐలయ్య, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు

### సేవాలాల్ ఉత్సవాలను విజయవంతం చేయాలి

చెన్నారావుపేట: శ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్ ఉత్సవాలను విజయవంతం చేయాలని నర్సంపేట డివిజన్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నర్సంపేటలోని మాదన్నపేట రోడ్డులోని సేవాలాల్ గుడిలో జరిగే గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ ఉత్సవాలను నిర్వహిస్తున్న ట్లు పేర్కొన్నారు. వేడుకలకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఏసీపీ, ఆర్డీఓ, సీఐలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎస్సైలు హాజరు కానున్నారని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు, గిరిజనులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

### సైన్స్ ఫెయిర్‌లో శ్రీవాణికి ప్రథమ బహుమతి

వరంగల్ చౌరస్తా : జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలికి ప్రథమ బహుమతి లభించింది. లక్ష్మీపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న శ్రీవాణి ఆన్‌లైన్‌లో జరిగిన జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు డీఈఓ వాసంతి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ చేతులమీదుగా బుధవారం బహుమతి అందుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ విజయ్‌కుమార్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు నరసింహారావు, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయడు బలవద్ది రాజు తదితరులు పాల్గొన్నారు.

### వివాహిత అదృశ్యం

చెన్నారావుపేట: వివాహిత అదృశ్యమైన సంఘటన మండలంలోని పాపయ్యపేటలో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారంపాపయ్యపేట గ్రామ శివారు గుడితండాకు చెందిన భూక్య హనుమా కూతురు అశ్వినిని మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని గుండెంగ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి ఇచ్చి నాలుగేళ్ల క్రితం వివాహం జరిపించారు. వీరికి రెండేళ్ల కూతురు ఉంది. కాగా మంగళవారం ఉదయం పుట్టింటికి వెళ్లింది. ఇంట్లో నుంచి ఎప్పుడు వెళ్లింది గమనించలేదు. తెల్లవారేసరికి కనిపించకుండా పోయిందన్నారు. తండ్రి హనుమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై లక్ష్మణమూర్తి తెలిపారు.

# విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

- హోమం పూజలు చేసిన అర్చకులు
- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

నర్సంపేట: పట్టణంలోని శాంతినగర్‌లో రాజశ్యామల ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీరాజశ్యామల నాగమృత లింగేశ్వరస్వామి శివపంచాయతన ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం నిర్వహించారు. గత నాలుగు రోజులుగా జరిగిన పూజలో మొదటి రోజు గణపతి పూజ, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, అంకురారోపణ, రెండోరోజు అగ్ని ప్రతిష్ఠాపన, మూల మంత్ర హోమం ప్రతిష్ఠామూర్తులకు పంచామృత అభిషేకాలు, స్థాపిత దేవత హోమాలు చేపట్టారు. మూడో రోజు రాజశ్యామల దేవతా విశేష అర్చన, శ్రీచక్ర మహాపూజ, రాజశ్యామల అమ్మవారి ఫల విశేషాలు అర్చనలు, నాలుగవ రోజు మూలమంత్ర హోమం, రుద్రహోమం, శ్రీరాజమాత నవవర్ణ హోమం, ఆదివాస హోమం, స్థాపిత దేవత హోమాలు, రాజశ్యామల హోమం, మాతంగి హోమం, ఐదో రోజు బుధవారం అశ్విని నక్షత్ర యుక్త మేశ లగ్నంలో లలితా మాత ఆవిర్భవించిన రోజు శ్రీరాజశ్యామల సహిత నాగమృత లింగేశ్వరస్వామి వారి యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవము వైభవంగా నిర్వహించారు. హోమం కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా రుత్వికుల వేదమంత్రోచ్చరణల మధ్య కార్యక్రమాలు నిర్వహించారు. వెన్నంపల్లి వెంకటసత్యనారాయణశర్మ, నిశాంతిశర్మ అవధాని, నారాయణశర్మ, రాజమండ్రి వాస్తవ్యులు నరేష్‌శర్మ, మల్లికార్జునశర్మ, అయినవోలు కృష్ణమూర్తి, వేద బ్రాహ్మణులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నర్సంపేట మునిసిపాలిటీ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ పాలాయి రవికుమార్, శ్రీరాముల శంకరయ్య, కౌన్సిలర్ నాగిశెట్టి పద్మప్రసాద్, రేమిడి శ్రీనివాస్, వేమిశెట్టి శ్రీనివాస్ దంపతులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిష్ఠాపన పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



హోమం పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

## కరాటేలో ఆర్డీఎఫ్ విద్యార్థుల ప్రతిభ

పర్వతగిరి: మండలంలోని రోళ్లకల్ ఆర్డీఎఫ్ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఈనెల 11న వైజాగ్‌లో జరిగిన షాటోకాన్ నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్–2024లో పాల్గొని మూడు గోల్డ్‌మెడల్, నాలుగు సిల్వర్, ఒక బ్రౌన్జ్ మెడల్ సాధించారని హెచ్ఎం బాషబోయిన రాములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 26న దుబాయిలో జరిగే ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌కు ఎ.అభినవ్, జె.వివేక్ ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను కరాటే పీఈటీ బి.రమేష్, అసిస్టెంట్ హెచ్ఎం ఇ.రమేష్, ప్రైమరీ ఇన్‌చార్జ్ జె.బాలరాజ్, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



నర్సంపేట: పట్టణంలోని గాంధీనగర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న బాధితురాలికి యువజన సంఘాల బాధ్యులు ఆబోతు రాజు యాదవ్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. ఈ మేరకు గాంధీనగర్‌కు చెందిన మహిళ దుర్గాభవాని కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న యువజన సంఘాల జిల్లా అధ్యక్షుడు ఆబోతు రాజుయాదవ్ తనమిత్రుల ద్వారా డబ్బులు సేకరించాడు. సేకరించిన రూ.6500, పదిరోజులకు సరిపడా నిత్యావసర వస్తువులను బాధిత కుటుంబానికి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో తిరునగిరి సిద్దార్థ, కొర్ర సారయ్య, కాందూరి నాగరాజు, రుద్ర రాజేష్, పైసా శరత్‌బాబు, శ్రీరామోజు కుమారస్వామి, రాగి నరేష్, పైండ్ల గగన్, పాల్గొన్నారు.

## సీఐ, ఎస్సైలను కలిసిన కాంగ్రెస్ నాయకులు



గీసుకొండ: ఇన్‌స్పెక్టర్‌ను కలిసిన ఎంపీపీ సౌజన్య



రాయపర్తి: ఎస్సైని శాలువాతో సత్కరిస్తున్న కాంగ్రెస్ సోషల్ మీడియా బృందం

గీసుకొండ: స్థానిక పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ఇటీవల బదిలీపై వచ్చిన బాబూలాల్‌ను ఎంపీపీ బీమగాని సౌజన్యతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. నాయకులు పత్తిపాక రవీందర్, నల్ల సురేశ్‌బాబు, వెంకటేశ్, రాజు, రఘుపతి, గుడిమల్ల భాస్కర్, పెళ్ళి రమేశ్, పోటు సుమన్, పవనశ, నాగరాజు, అనిల్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రాయపర్తి: మండలానికి నూతనంగా వచ్చి విధుల్లో చేరిన ఎస్సై వడ్డె సందీప్‌కుమార్‌ను కాంగ్రెస్ పార్టీ సోషల్‌మీడియా బృందం బుధవారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఎస్సైని శాలువాతో ఘనంగా సత్కరించారు. కలిసిన వారిలో కాంగ్రెస్ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ బండి రాజేంద్రప్రసాద్, టౌన్ కో–ఆర్డినేటర్ ఉబ్బని నవీన్, అంగిరేకుల మధుకర్, గుగులోతు వెంకన్న, బాదావత్ సురేష్, కందుకూరి రవి, గూడెల్లి యాదగిరి, బెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో ఢీకొని ఒకరికి గాయాలు

నర్సంపేట రూరల్ : ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొనడంతో ద్విచక్రవాహనదారుడికి గాయాలైన సంఘటన మండలంలోని రాజుపేట శివారులో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేట డివిజన్ సెరికల్చర్ అధికారి సంజీవరెడ్డిని రాజుపేట, ముత్యాలమ్మతండాలకు స్పెషలాఫీసర్‌గా నియమించారు. అయితే తన విధుల్లో భాగంగా నర్సంపేట నుంచి రాజుపేటకు ఉదయం ద్విచక్రవాహనంపై బయలుదేరి వెళ్తున్నారు. ఈక్రమంలో నల్లబెల్లి నుంచి ప్రయాణికులతో ఆటో నర్సంపేట వైపు వస్తుంది. అయితే రాజుపేటకు చేరుకునేసరికి మరో వాహనం రోడ్డుపైకి రావడంతో దానిని తప్పించబోయి సంజీవరెడ్డి ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషయంగా వరంగల్‌కు వైద్యులు రెఫర్ చేశారు.

## ఘనంగా మండమెలిగె పూజలు

గూడూరు: మండలంలోని దామరవంచ సమీప మహబూబాబాద్ వైపు వెళ్లే జాతీయ రహదారి పక్కన చింతలగట్టు వట్టివాగు శ్రీసమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద బుధవారం జాతర నిర్వహణ కమిటీ, పూజారులు ఘనంగా మండమెలిగె కార్యక్రమం నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ గుగులోతు సుచిత్ర, మండల కాంగ్రెస్ నాయకులు పూజల్లో పాల్గొన్నారు. పూజారి దారం సిద్దు బృందం అమ్మవార్ల గద్దెలను శుభ్రం చేసి, చుట్టూ మకర తోరణాలు కట్టించారు. అనంతరం జాతర ప్రదేశ నిర్బంధ పూజలు చేశారు. అప్పటితో నిర్వహణ కమిటీ, పూజారులు సంప్రదాయ పద్ధతిలో జాతరను ప్రారంభించినట్లు తెలిపారు.



మామిడి తోరణాలు కడుతున్న భక్తులు

## ఘనంగా వసంత పంచమి వేడుకలు



చెన్నారావుపేట : సరస్వతి చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న ఉపాధ్యాయినులు




ఐనవోలు : ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు

చెన్నారావుపేట: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాల, జాగృతి హైస్కూల్ లో, శ్రీ సిద్ధేశ్వరాలయంలో వసంత పంచమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్ధేశ్వరాలయంలో సిద్ధేశ్వరుడు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చాడు. కార్యక్రమాల్లో ఎస్ఓ జ్యోతి, ఉపాధ్యాయినీలు తేజస్విని, దేవిక, సుమలత, సుజాత, జాగృతి కరాస్పాండెంట్ ఈగ సత్యనారాయణ, దేవి, సాయి శాస్త్రీ, గణేష్ శాస్త్రీ, తదితరులు ఉన్నారు.

ఐనవోలు : మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో గల శ్రీభ్రమరాంబిక అమ్మవారి సన్నిధిలో బుధవారం వసంతపంచమి వేడుకలతో పాటు దశమ వార్షికోత్సవాన్ని పండితులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, అమ్మవారికి సుగంధ పరిమళ ద్రవ్యాలతో విశేష అభిషేకము, నవకలశస్నపనం, నీరాజన మంత్రపుష్పాన్ని ఆలయ కార్యనిర్వాహణాధికారి అద్దంకి నాగేశ్వర్‌రావు, దేవాలయ ఉపప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు పాతర్లపాటి శ్రీనివాస్, వేదపండితులు గట్టు పురుషోత్తమశర్మ, విక్రాంత్ వినాయక్‌జోషి, అర్చక సిబ్బంది నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## 20 వరకు ఈ కేవైసీ చేయించుకోవాలి

రాయపర్తి: ప్రధానమంత్రి కిసాన్ (పీఎం కిసాన్) ఈకేవైసీ చేసుకోని రైతులు ఈనెల 20 వరకు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి గుమ్మడి వీరభద్రం కోరారు. బుధవారం స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో ఏఈఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఈకేవైసీ చేసుకోని వారు 590 మంది రైతులు ఉన్నారని వారంతా ఏ ఈఓలకు సహకరించి ఈకేవైసీ చేయించుకోవాలని రైతులను కోరారు. గ్రామాల్లో పంటల నమోదుకు వచ్చేందుకు ఏఈఓలు వచ్చిన క్రమంలో లేదా మండల వ్యవసాయాధికారి కార్యాలయంకు వచ్చి ఈకేవైసీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శిరీష, రాజేష్, హిమబిందు, సాయిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ఏఈఓలతో మాట్లాడుతున్న ఏఓ వీరభద్రం

## బిట్స్‌లో ప్రాంగణ నియామకాలు

నర్సంపేట రూరల్ : మండలంలోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ప్రాంగణ నియామకాలు చేపట్టారు. ఇన్‌డ్యూర్ అండ్ డిజైన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో క్వాలిటీ కంట్రోల్ మెకానికల్, సివిల్, ఈఈఈ విద్యార్థులకు ప్రాంగణ నియామకాలు చేపట్టారు. ఈ నియామకాల్లో 150 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా మొదటి రౌండ్‌కు 113 మంది విద్యార్థులు ఎంపికకాగా చివరి రౌండ్‌లో 28 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు బీటెక్ పూర్తిగా కాగానే జాబ్‌లోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం నియామక పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ ఎ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి, సెక్రటరీ రాజేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వీఎస్ హరిహరన్, ముఖ్యప్రాంగణ నియామకపు అధికారి, ఏఓ సురేష్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ హెడ్ ఫసీ అహ్మద్ పర్వేజ్, అకడమిక్ కోఆర్డినేటర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

సంగెం: మహిళా రక్షణ చట్టాలపై సమాజంలోని బాలికలు, మహిళలు అవగాహన పెంచుకుని అవసరమైన సందర్భంగా ఉపయోగించుకోవాలని సఖి లీగల్ కౌన్సిలర్ శోభారాణి అన్నారు. బుధవారం మండలంలోని గవిచర్లలో మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గృహహింస చట్టాలు, ఆడమగ అనే వివక్షత చూపించవద్దని వివరించారు. ఆడపిల్లలను మగపిల్లలతో సమానంగా పెంచి ఉన్నతంగా ఎదిగేలా చూడాలన్నారు. ఆపద సమయంలో మహిళలు హెల్ప్‌లైన్ 181, 100 నంబర్లకు ఫోన్‌చేసి సహాయం పొందాలన్నారు. సఖి సెంటర్ ద్వారా అందిస్తున్న కౌన్సెలింగ్, పోలీస్, న్యాయ, వైద్య, తాత్కాలిక వసతి, రెస్క్యూ వంటి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నిర్మలాదేవి, అడ్మినిస్ట్రేటర్ వల్లే శ్రీలత, ఏపీఎం కిషన్, సీసీ స్వరూప రాణి, వీఓఏ అంబిక, అంబేద్కర్ వీఓ సభ్యులు పాల్గొన్నారు.



మహిళ చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సఖి సిబ్బంది

## బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓలు

వర్ధన్నపేట: వర్ధన్నపేట, నల్లబెల్లి, చెన్నారావుపేట, పర్వతగిరి, ఖానాపురం, దుగ్గొండి, గీసుకొండ ఎంపీడీఓలుగా వెంకటరమణ నర్సింహమూర్తి, గోవింద్‌రావు, ఎం. శంకర్, ఈగల భారతి, లెక్కల అరుంధతి, వి.కృష్ణవేణిలు బుధవారం ఆయా మండల కేంద్రాల్లోని మండల పరిషత్ కార్యాలయాల్లో బాధ్యతలు చేపట్టారు. ఐనవోలు ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తూ బదిలీల్లో భాగంగా వెంకటరమణ వర్ధన్నపేటకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓలను ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు మర్యాదపూర్వకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీ ఓలు మాట్లాడుతూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా గ్రామాల అభివృద్ధి కోసం పాటుపడతామని చెప్పారు. మండల పరిధిలోని అన్ని గ్రామాలను పక్షపాతం లేకుండా సమగ్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. మండల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కలిసి రావాలని వారు సూచించారు.



వర్ధన్నపేట: ఎంపీడీఓ వెంకటరమణను సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

## హైదరాబాద్‌కు తరలిన శిక్షణ కానిస్టేబుళ్లు

వరంగల్ క్రైం: తెలంగాణ పోలీస్‌శాఖలో ఎంపికైన శిక్షణ కానిస్టేబుళ్లు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక ఉత్తర్వులను అందుకునేందుకు బుధవారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈ మేరకు ఏర్పాటుచేసిన ప్రత్యేక బస్సులను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా హైదరబాద్‌కు జెండా ఊపి పంపించారు. ఈ సందర్భంగా కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ చట్టాన్ని పరిరక్షించే పోలీస్ అధికారులుగా శాఖలో అడిగిడుతున్నందుకు అభినందనలు తెలిపారు. కమిషనరేట్ పరిధిలో 982 మంది కానిస్టేబుళ్లు ఉన్నారని, ఇందులో సివిల్ , ఏఆర్, స్పెషల్ పోలీస్ , జైలు వార్డర్స్, ఐటీ, కమ్యూనికేషన్‌లకు చెందిన వారు ఉన్నట్లు వివరించారు. వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ శిక్షణ విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, రాధికా గుప్తా , ట్రైనీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, అదనపు డీసీపీ సంజీవ్, ఏసీపీలు సురేంద్ర, అనంతయ్య, ఆర్ఐలు స్పర్జన్, శ్రీధర్ లు తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌కు వెళ్తున్న బస్సు వద్ద శిక్షణ కానిస్టేబుళ్లు, సీపీ, కలెక్టర్ తదితరులు

## ప్రతి గడపకు వెళ్లి బీజేపీ విజయాలు వివరించాలి

వరంగల్: డివిజన్‌లోని ప్రతి గడపకు వెళ్లి బీజేపీ జాతీయ, రాష్ట్ర స్థాయిలో సాధించిన విజయాలు, కేంద్రంలో మోదీ అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని ఆ పార్టీ వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ మురళీధర్‌గౌడ్ అన్నారు. ఆ పార్టీ చేపట్టిన 'గావ్ చలో అభియాన్'లో భాగంగా కోఆర్డినేటర్ వన్నాల వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం 21వ డివిజన్‌లోని 70, 71, 88 బూత్‌లలో ప్రచార కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వందే భారత్ రైళ్లు, సమ్మక్క సారలమ్మ గిరిజన విశ్వవిద్యాలయం , పసుపు బోర్డు, బీబీనగర్‌లో ఎయిమ్స్, ముద్ర లోన్లు ఇలా అనేక విజయాలు మన పార్టీకి సొంతమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.పరమేశ్వర్, బి.హరిశంకర్, కె.రంజిత్, డి.భవానిశంకర్, కె.శ్రీనివాస్, కె.నాగరాజు, అపురూప రజనీష్‌నేత, రాజేందర్, కె.సతీష్, సత్యం, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచార కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు

## 16న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

- ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు

నెక్కొండ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం దేశవ్యాప్త సమ్మె వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రం రైతాంగాన్ని విస్మరిస్తూ కార్పొరేట్ శక్తులకు ఎర్ర తివాచీ పరుస్తోందని ఆరోపించారు. సమ్మెలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మికులు రామారపు శ్రీమన్నారాయణ, తాటికాయల యాకయ్య, ఈదునూరి నవీన్, రాజు, అనిల్, యాట యాకయ్య, వీరన్న, యాదగిరి, సురేష్, పాల్గొన్నారు.

నర్సంపేట: దేశవ్యాప్తంగా ఈనెల 16న చేపట్టిన సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు గోనె యువరాజు, అనంతగిరి రవి, గుంపెల్లి మునీశ్వర్ కోరారు. ఈ మేరకు బీఆర్‌టీయూ, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐఎఫ్‌టీయూ(న్యూ) సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నర్సంపేట వ్యవసాయ గ్రేన్ మార్కెట్ కార్యదర్శి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్, కిరాణా వర్తక సంఘం, ఐరన్‌అండ్ హార్డ్‌వేర్, ఫర్టిలైజర్, తదితర యాజమాన్యాలకు సమ్మె నోటీసు ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కందికొండ రాజు, నాగులు, జనార్దన్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

గీసుకొండ: కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్, మతతత్వ , కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న దేశవ్యాప్తంగా చేపట్టిన కార్మిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని పలు వామపక్ష పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో జాయింట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్, సంయుక్త కిసాన్ మోర్చా, ఎస్‌కేఎం రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు సమావేశమై బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చుక్క మొగిలి, కంది కుమారస్వామి, చల్లా నర్సిరెడ్డి, శంకరయ్య, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి: ఈనెల 16న జరిగే గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ.ఇస్మాయిల్ పిలుపునిచ్చారు. మండలంలోని కొంకపాక శివారు కేఎస్‌ఆర్ రైస్ మిల్లు హమాలీ కార్మికులతో బుధవారం రైతు సంఘం, కార్మిక సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాలు సమావేశం నిర్వహించారు. హమాలీ సంఘం నాయకులు వీరన్న, శంకరన్న, లాలు, చేరాలు, ఈరమల్లు, మల్లయ్య, ఐలన్న, ఉప్పలన్న పాల్గొన్నారు.



నెక్కొండ : వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చెన్నకేశవులు, కార్మికులు



నర్సంపేట: యాజమాన్యాలకు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మిక సంఘాలు



గీసుకొండ : మాట్లాడుతున్న నాయకుడు శంకరయ్య



పర్వతగిరి : సమావేశంలో మాట్లాడుతున్న ఇస్మాయిల్